
ఉచిత గ్యాస్ ఉత్తదేనా!





- కొందరికే సబ్సిడీ జమ
- బ్యాంకులు, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ వినియోగదారుల ప్రదక్షిణ
- ఎంత తిరిగినా దక్కని ఫలితం

పెదగంట్యాడ: రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులందరికీ ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రకటించింది. అందులో భాగంగా లబ్ధిదారులు మొదట సొంత డబ్బులు కట్టి సిలిండర్లు తీసుకోవాలి. తర్వాత మూడు రోజులకు వారి ఖాతాల్లో డబ్బు జమ చేస్తామని తెలిపింది.. తర్వాత కొన్ని రోజులకు ఇంకో మెలిక పెట్టారు. తొలి సిలిండర్ బుక్ చేసుకోవాలని ప్రకటించారు.

కొందరికే డబ్బులు జమ

ఉచిత సిలిండర్‌లు వస్తాయనే ఆశతో లబ్ధిదారులు డబ్బు కట్టి సిలిండర్లు తీసుకున్నారు. వారం కాదు కదా.. నెలలు గడుస్తున్నా వారి ఖాతాల్లో డబ్బు జమ కాలేదు. దీంతో గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఏజెన్సీ వారు మాత్రం తమకు ఇచ్చిన లిస్ట్‌లో ఉన్న వారికి మాత్రమే డబ్బులు పడతాయని.. మిగతా వారికి ఎందుకు పడలేదనే విషయాన్ని రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి తెలుసుకోవాలని సూచిస్తున్నారు. లేకపోతే 1967కు డయల్ చేయాలంటూ సలహాలు ఇస్తున్నారు.

పరుగో.. పరుగు

గ్యాస్ కనెక్షన్ ఉన్న మండలంలోని వినియోగదారులు భారత్ గ్యాస్, ఇండియన్ గ్యాస్, హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీల వద్దకు పరుగులు తీస్తున్నారు. తీరా అక్కడికి వెళ్లి విచారణ చేస్తే మీ పేరు లబ్ధిదారుల జాబితాలో లేదని చెబుతుండడంతో అవాక్కవుతున్నారు. గతంలో తమకు గ్యాస్ సబ్సిడీ డబ్బులు పడుతూ వచ్చాయని ఇప్పుడు దీపం పథకం జాబితాలో లేదనడం ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎవరిని అడగాలో!

ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి సంబంధించి సమస్యలపై ఎవరిని ఆశ్రయించాలో తెలియక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులను ప్రశ్నిస్తే తమవద్ద ఎలాంటి సమస్య లేదంటున్నారు. బ్యాంకులో గానీ పౌర సరఫరాల కార్యాలయంలో గానీ సంప్రదించాలని చేతులు దులుపుకుంటున్నారు..బ్యాంకులకు వెళ్లి విచారిస్తే గ్యాస్ ఏజెన్సీల వద్దే తెలుస్తుందని వెనక్కి పంపుతున్నారు. దీంతో లబ్ధిదారుల ఆవేదన వర్ణనాతీతంగా ఉంటోంది. చాలా మంది సబ్సిడీ పై ఆశలు వదులేసుకుంటున్నారు. దీనికి తోడు ప్రభుత్వం చెప్పినట్టు 48 గంటల లోపు కాకుండా వారం పది రోజుల తర్వాత సబ్సిడీ పడుతోంది.

నెలలు గడుస్తున్నా..

మండల వ్యాప్తంగా 32,825 రేషన్ కార్డులు ఉన్నాయి. దీపం పథకం కింద 22,917 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. ఇందులో సుమారుగా 8 వేల మందికి పైగా ఈ పథకం వర్తించడం లేదని సమాచారం. సిలిండర్ బుక్ చేసుకున్న రెండురోజుల్లో సబ్సిడీ డబ్బులు జమ చేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం ఆచరణకు వచ్చేసరికి చేతులెత్తేసింది. కొందరికి రెండు నెలలు గడుస్తున్నా సబ్సిడీ జమ కాలేదు.



రెండుసార్లు బుక్ చేసుకున్నా..

ఇప్పటిదాకా డబ్బు చెల్లించి రెండుసార్లు గ్యాస్ సిలిండర్ బుక్ చేశాను. సబ్సిడీ డబ్బులు మాత్రం జమ కాలేదు. గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లి అడిగితే పొంతన లేని సమాధానాలు ఇస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జమ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

–గొందేశి వెంకటలక్ష్మి, నెల్లిముక్కు



డబ్బులు జమ కాలేదు

నేను పని చేసుకుని జీవనం సాగిస్తున్నాను. దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్నాను. గ్యాస్ డెలివరీ సమయంలో డబ్బులు చెల్లించి సిలిండర్ తీసుకున్నాను. నెల రోజులు దాటినా నాకు డబ్బు జమ కాలేదు. ఏమని గ్యాస్ ఏజెన్సీ వద్దకు వెళ్లి అడగితే సరైన సమాధానం రాలేదు. ఈకేవైసీ కూడా చేయించుకున్నాను. అయినా డబ్బులు జమ కాలేదు.

– రోమాల వరలక్ష్మి, సింహగిరి కాలనీ



ఆందోళన అవసరం లేదు

ఉచిత గ్యాస్ సిలిండర్ సబ్సిడీపై లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆధార్ డేటాబేస్‌ను గ్యాస్ ఏజెన్సీతో పాటు బ్యాంకులోనూ పరిశీలించుకోవాలి. బ్యాంకులో అకౌంట్ ఇన్‌యాక్టివ్, ఆధార్ లింకు లేకపోవడం, హోల్డ్ లాంటి సమస్యలు ఉంటాయి. వినియోగదారులు సరిచేసుకోవాలి.

–తవ్వా కృష్ణ, ఏఎస్‌వో, పౌరసరఫరాల శాఖ, గాజువాక

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాల పంట


పతకాలతో వరలక్ష్మి

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ మీడియం మర్చంట్ అండ్ స్ట్రక్చరల్ మిల్ (ఎం.ఎం.ఎస్.ఎం) విభాగం సీనియర్ మేనేజర్ కోరెడ్డి సత్యనారాయణ భార్య వరలక్ష్మి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో మూడు పతకాలు సాధించారు. కేరళ రాష్ట్రంలోని త్రిశూర్‌లో గత నెల 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు 6వ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2025 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో వరలక్ష్మి పాల్గొని 5 వేల మీటర్ల నడక పోటీలో బంగారు పతకం, 5 కిలోమీటర్ల పరుగు, 10 కిలోమీటర్ల పరుగు పోటీల్లో కాంస్య పతకాలు గెలుపొందారు. ఈ సందర్భంగా ఆమెను స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు అభినందించారు.

హయ్యర్ పెన్షన్‌పై చర్యలు తీసుకోవాలి


రీజనల్ పీఎఫ్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే పల్లాతో ఉక్కు పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల హయ్యర్ పెన్షన్‌పై ఈనెల 7లోగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కోరారు. స్టీల్‌ప్లాంట్ పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులతో కలిసి ఆయన సోమవారం రీజనల్ ప్రావిడెంట్ ఫంట్ కమిషనర్లు విజయకుమార్, పవన్ కుమార్‌ను కలిశారు. ఈపీఎఫ్‌వో ఆదేశాల మేరకు సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ట్రస్ట్ చెల్లింపులు సత్వరమే జరిగేలా చూడాలని కోరారు. ఆయన వెంట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం చంద్రరావు, కె.వి.డి. ప్రసాద్, ద్వారం స్వామి, రిటైర్డ్ ఉద్యోగులు వాసామ్నా, దశరథ్, అప్పలస్వామి, దుద్దు శ్రీనివాస్, వెంకట్రావు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

కమనీయం.. గణపతి కల్యాణం


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులో వేంచేసియున్న సంకటమోచన గణపతి ఆలయంలో సోమవారం సంకటమోచన గణపతి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మంత్రి రాజశేఖర్, మంత్రి శంకరనారాయణ, మంత్రి నరసింహమూర్తి ఆధ్వర్యంలో జై గణేషా అంటూ భక్తులు పరవశించారు, కుటుంబ సమేతంగా తరలి వచ్చి కల్యాణాన్ని తిలకించారు. ముందుగా ఆలయంలో మహా కుంభాభిషేకం, సంకటమోచన గణపతికి విషేష అభిషేకాలు, మహాపూర్ణహుతి నిర్వహించారు.

శ్రీవారికి పటిక, బియ్యం తులాభారం సమర్పణ


చిన్నారులకు తులాభారం వేస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారికి పటిక, బియ్యాన్ని తులాభారంగా సమర్పించారు. షీలానగర్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన వారు తమ పిల్లల బరువుకు తగ్గట్టుగా పటిక, బియం స్వామికి సమర్పించారు.

రథసప్తమికి ఏర్పాట్లు

తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో మంగళవారం రథసప్తమి పండగను ఘనంగా నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని సూర్యప్రభ వాహనంపై దివ్యక్షేత్రం మాడవీధుల్లో ఊరేగించనున్నట్టు వెల్లడించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత


10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. 1990–91, 1991–92, 1999 – 2000 బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు 8, 9వ తరగతులకు విద్యార్థులకు ఐడీ కార్డులు, 10వ తరగతి విద్యార్థులకు ప్యాడ్, పెన్ను, పెన్సిల్, నోట్ బుక్‌లు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం ఉషారాణి, పీడీ ఇస్మాయిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిబాబుకు వివేకానంద ఇండియన్ ఐకాన్ పురస్కారం


గిరిబాబుకు పురస్కారం అందజేస్తున్న బుద్ధప్రసాద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగం ఉద్యోగి గన్నంరాజు గిరిబాబుకు ప్రతిష్టాత్మక వివేకానంద ఇండియన్ ఐకాన్ పురస్కారం లభించింది. తెలుగు వెలుగు జాతీయ సంస్థ, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్తంగా ఏటా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన వ్యక్తులకు పురస్కారాలు అందజేస్తుంటారు. గిరిబాబు చేస్తున్న కళా, సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను గుర్తించి ఈ ఏడాది ఆయనకు ఈ పురస్కారాన్ని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చేతుల మీదుగా గిరిబాబుకు పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గిరిబాబుకు తోటి ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా గొడౌన్లు ఎలా నిర్మిస్తారు


అధికారులకు పరిస్థితి వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడివాడ లతీష్

అక్కిరెడ్డిపాలెం: ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా కాలుష్య కారక గొడౌన్లు ఎలా నిర్మించారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ ప్రశ్నించారు. మిందీ, అక్కిరెడ్డిపాలెం, పంచవటీలకు కూతవేటు దూరంలో గ్రీన్ పెట్రో కోక్ నిల్వల గొడౌన్లు ఏర్పాటుతో భూ కాలుష్యంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. రసాయన పదార్థాలు నిల్వ చేస్తున్న గొడౌన్ల వద్దకు సంబంధిత అధికారులతో కలిసి సోమవారం ఆయా గ్రామాల నాయకులు పరిస్థితిని సమీక్షించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉండాల్సిన కాలువలను మూసి వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలు కురిసేటప్పుడు పరిసర గ్రామాలు ముంపునకు గురవుతాయని అధికారులకు వివరించారు. ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించకుండా ఎలా అనుమతులు ఇచ్చారని అన్నారు. గతంలో జింక్ పరిశ్రమ వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, పరిశ్రమ మూతపడడంతో పరిసర గ్రామాలు ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో ఇప్పుడు గ్రీన్ పెట్రో కెమికల్స్ నిల్వల గొడౌన్లు నిర్మాణం పరిసర ప్రాంత గ్రామాల ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని అధికారులకు వివరించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారి శాంతి స్వరూప్ భట్నాగర్‌కు సూచించారు. కార్యక్రమంలో పోవా అధ్యక్షుడు పి.చిన్నారావు, నాయకుడు గుంటూరు నర్సింహమూర్తి, లోకేష్ పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం!


అక్కిరెడ్డిపాలెం ప్రధాన రహదారి పక్కన అచ్ఛాదన ఏర్పాటు చేయకుండా చేపడుతున్న నిర్మాణం

అక్కిరెడ్డిపాలెం: టౌన్ ప్లానింగ్ అధికారుల అండతో జీవీఎంసీ 68, 69వ వార్డులో నిర్మాణ దారులు పేట్రేగి పోతున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారి పక్కన నిబంధనలు పాటించకుండాపనులు చేపడుతుండటంతో వీటి పక్కగా వెళ్తున్న పాదచారులు, వాహనచోదకులపై ఇసుక, గులకరాళ్లు పడుతున్నాయి. వాటరింగ్ చేస్తున్న సమయంలో వారిపై నీరు పడుతుందని ఆలోచించకుండా ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నాడు. ఇదేంటని అడిగితే దురుసుగా వ్యవహరిస్తున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రధాన రోడ్డుపక్కగా నిర్మాణాలు చేపడితే పరదా లాంటివి ఏర్పాటు చేసుకోవాలి. దీని వల్ల ఎవరిమీద నిర్మాణ సామగ్రి పడకుండా ఉంటుంది.

నిర్మాణంపై పలు అనుమానాలు!

ఈ నిర్మాణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్కిరెడ్డిపాలెం గ్రామ కంఠం 29గా ఉంది. కానీ సదరు నిర్మాణ దారుడు డాక్యుమెంట్‌లో గ్రామ కంఠం నంబరు లేదు. వేరే సర్వేనంబర్‌పై తప్పుడు పత్రాలతో నిర్మాణం జరుపుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

అగనంపూడి: ఔషధ శాస్త్రంపై నిర్వహించిన సదస్సులో దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చి బహుమతులు దక్కించుకున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు తెలిపారు. రెండు రోజుల కిందట చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్, ఫార్మా నెస్ట్ 5ఈ, వీవీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, గుంటూర్ విజ్ఞాన్ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ సదస్సులో దువ్వాడ ఫార్మా కళాశాల విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించడంతో సోమవారం కళాశాలతో వారిని అభినందించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ పి.వి. కమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలి


కోక్‌ఓవెన్స్ విభాగాధిపతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సోమవారం కోక్‌ఓవెన్స్, ఆర్.ఎం.హెచ్.పి, టీపీపీ, సింటర్ ప్లాంట్ విభాగాధిపతుల కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధి జోలికి రాబోమని అక్టోబర్ 2న ఆర్‌ఎల్‌సీ సమక్షంలో అంగీకరించి ఇప్పుడు దొడ్డిదారిన తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తే కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం ఆయా విభాగాధిపతులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జి. శ్రీనివాసరావు, మంత్రి రవి, ఉమ్మిడి అప్పారావు, శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం



అలంకరణలో త్రిశక్తి అమ్మవారు, సామూహిక అక్షరాభ్యాస్యాల్లో పాల్గొన్న చిన్నారులు , తల్లిదండ్రులు

ఉక్కునగరం: వసంత పంచమి పురస్కరించుకుని పలు ఆలయాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో బీజాక్షరాలు దిద్దించారు. స్థానిక త్రిశక్తి దేవాలయంలో సోమవారం సామూహిక అక్షరాభ్యాసాలు ఘనంగా జరిగాయి. వేకువజామున మహాలక్ష్మి, మహాదుర్గ, మహాసరస్వతి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. సరస్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మండపంలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసాల్లో వందలాది మంది తల్లిదండ్రులు, తమ పిల్లలతో పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసాలు


చిన్నారులకు విద్యాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: వసంత పంచమిని పురస్కరించుకుని పలు స్కూల్స్, దేవాలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం షీలానగర్ వేంకటేశ్వరకాలనీలోని బీవీకే స్కూల్లో స్కూల్ ఉపాధ్యాయుల చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో, తుంగ్లాంలోని శ్రీ దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి దంపతులుచిన్నారులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు.

రథసప్తమి పూజలకు ఏర్పాట్లు


దానప్పతల్లి

కూర్మన్నపాలెం: రథసప్తమిని పురస్కరించుకుని కూర్మన్నపాలెం పరిసర ప్రాంతాల్లోని ఆలయాలు ముస్తాబయయ్యాయి. భక్తులకు ఇంబందులు కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం దేవాలయాలతో పాటు ప్రతి ఇంటిముందు పూజలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. పొంగలి వండేందుకు మహిళలు సిద్ధమయ్యారు. రేగు, ఈసు పుల్లలతో ప్రత్యేక రథాలు తయారు చేసి మహిళలు సూర్య దేవునికి పూజలు చేస్తారని వేద పండితులు తెలిపారు. దీనిలో భాగంగాగ్రీన్ సిటీలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, గౌరీవీధిలో గణపతి మందిరం, ప్రధాన రహదారిలో ఉన్న దానప్పతల్లి గుడిలో విస్తృతంగా ఏర్పాట్లు చేసినట్లు ఆయా ఆలయాల కమిటీ ప్రతినిధులు ప్రకటించారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ


వడ్లపూడి పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడికి చెందిన మానవత్వ చారిటబుల్ ట్రస్ట్ 7వ వార్షికోత్సవం సందర్భంగా వడ్లపూడి ప్రాథమిక పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వసంత పంచమి సందర్భంగా గాజువాక మండల విద్యాశాఖాధికారులు బి.విశ్వనాథం, ఎం.సునీత ఆ విగ్రహాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మానవత్వ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జె.లక్ష్మికుమారి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వడ్లపూడి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీపీఎం నూతన కమిటీకి అభినందనలు

అక్కిరెడ్డిపాలెం: నెల్లూరులో సోమవారం జరిగిన సీపీఎం నూతన కమిటీలో కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వి.శ్రీనివాసరావుతో పాటు ఇతర నూతన కమిటీ సభ్యులకు భెల్ (హెచ్‌పీవీపీ) సీపీఎం నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సిటూ ప్రధానకార్యదర్శి జి.టి.పి.ప్రకాష్, కె.నారపురెడ్డి, ఎస్.జగన్నాథరావు, ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన అవసరం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

అగనంపూడి: రక్తదానంపై అవగాహన ఉంటే యువత రక్తదానం చేయడానికి ముందుకు వస్తుంద విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో వంద యూనిట్ల రక్తాన్ని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌కు అందించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ పి.సన్యాసిరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సత్యలక్ష్మి పాల్గొన్నారు.